

## విరబూసిన మామిడి

సోమల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త
మండలంలో ప్రధాన వాణిజ్య పంట అయిన మామిడి ఈ సంవత్సరం పూత విరబూయడంతో రైతుల ముఖంలో ఆనందం వెల్లువరిస్తుంది. సోమల మండలంలో దాదాపు 8 వేల ఎకరాల లో మామిడి చెట్లు ఉన్నాయి. గత రెండేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలను అధిగమించి దిగుబడును సాధించిన గిట్టుబాటు ధర లేకపోవడంతో తాము పండించిన పంటను రోడ్లపై పారబోసి నిరసన తెలిపే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ యేడు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం ప్రతి చెట్టు పూతకు రావడం ఆనందంగా ఉన్న దిగుబడి పెరిగితే కాయలు ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. ప్రభుత్వం దిగుబడులను ముందుగానే అంచనా వేసి రైతులను ఆదుకునేందుకు సరైన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాల్సి ఉంది.




## ధ్వజారోహణంతో కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

### -రాత్రి హంసవాహనంపై పరమేశ్వరుడు



తిరుపతి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త
తిరుపతిలోని ప్రసిద్ధశైవాలయం కపిలేశ్వరుని ఆలయంలో ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకుల వేదమంత్రోచ్చరణలు, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయస్వామిగురుకుల్ అధిరోహింపజేశారు. టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ మురళీకృష్ణ, ఆలయ ప్రత్యేక అధికారి ఫణికుమార్‌నాయుడు, ఆలయ సూపరిండెంటెంట్ కెవి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. రాత్రి హంసవాహనంపై పరమేశ్వరుడు ఊరేగి భక్తులను కటాక్షించారు. ఆలయంలో భక్తులకు సౌకర్యాలు, ఏర్పాట్లపై ఈఓ రవిచంద్ర ఆరా తీశారు

# కన్నుల పండువగా ధ్వజారోహణం

### శ్రీనివాస మంగాపురంలో వైభవంగా కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

### స్వామివారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు : టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర



ఆదివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి దేవదేవుడు పెద్దశేష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు

చంద్రగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:
శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన ధ్వజారోహణం కార్యక్రమంతో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమైనట్లు టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం ఉదయం టిటిడి ఈఓ ధ్వజారోహణం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న గరుడ వాహనసేవ, 15న రథోత్సవం, 16న చక్రస్నానం పర్వదినాలలో భక్తుల రాకకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాలలో ప్రతి రోజూ 500 మందికి అన్నప్రసాదాలను అందించడం, అదేవిధంగా తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం భక్తులకు అందుబాటులో వుంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఈఓ వీరబ్రహ్మం, టిడిపి ఛీఫ్ పిఆర్ఓ రవి, ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాద్, సూపరింటెండెంట్స్ రాజ్‌కుమార్, వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి, నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

### కుంభ లగ్నంలో ధ్వజారోహణ ఘట్టం

శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలోని ధ్వజస్థంభం వద్ద ఉదయం 8.15 గంటల 8.35 గంటల మధ్యన కుంభ లగ్నంలో ధ్వజారోహణ ఘట్టం పూర్తి చేయడం జరిగిందని ఆలయ కంకణభట్టార్ బాలాజీ రంగకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుచ్చి వాహనంపై తిరుమాడవీధులలో విహరించి ఆలయ ఆవరణలోని ధ్వజస్థంభం వద్దకు చేరుకున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ట, రక్షా బంధనం చేపట్టారు. వైఖానస ఆగమోక్తంగా గరుత్మంతుడిని నూతన వస్త్రంపై లిఖించి ప్రత్యేక పూజలతో ధ్వజస్థంభంపై ప్రతిష్టించారు. అనేక పుణ్యదానాల ఫలితాలు ఒక్క గరుడారోహణంతో లభించే పుణ్యఫలాలకు సాటిరాదని పురాణాలు వెళ్ళడిస్తున్నాయి. అదేవిధంగా సమాజశ్రేయస్సు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుందని విషయాలను తెలియజేస్తున్నాయి. 18 గణాల ముక్కోటి దేవతలను అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే ధ్వజారోహణ ఘట్టం ముఖ్య లక్ష్యమని అన్నారు.

### పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు

#### మిరుమిట్లుగొలిపిన దేవదేవుడు

చంద్రగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:
శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆదివారం రాత్రి శ్రీనివాసుడు పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దేవదేవుడు పెద్దశేష వాహనంపై విహరిస్తూ భక్తజనుల గోవిందనామస్మరణల నడుమ సర్వాంతర్యామియై లోకరక్షకుడుగా ప్రజల ఈతిబాధలను తొలగించి మోక్షమార్గం ప్రసాదిస్తూ తిరుమాడవీధులలో ఊరేగారు. ఈ వాహన సేవలో గజ, అశ్వదళ, నంధి సమేత కోలాటాల కోలాహలం నడుమ భక్తులు గోవిందనామస్మరణలతో శ్రీనివాసుడిని దర్శించుకున్నారు.

# చిత్తూరులో రెండు ఏనుగులు ప్రత్యక్షం

### భయభ్రాంతులైన ప్రజానీకం

### సంతపేట బుడ్డమాను చెరువులో రోజంతా జలకాలాట

### అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్ళడానికి అటవీశాఖ అధికారులు ప్రయత్నం



సంతపేట బుడ్డమాను చెరువు పరిసరాల్లో ఏనుగు, బుడ్డమాను చెరువులో ఏనుగుల జలకాలట

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:
జిల్లా కేంద్రం చిత్తూరు సంతపేట పరిసరాల్లో ఆదివారం తెల్లవారుజాము 5 గంటలకు ఒక్కసారి రెండు మగ ఏనుగులు ప్రత్యక్షం అయ్యాయి. ఇళ్ళ పరిసరాల్లో ఒక్కసారిగా రెండు మగ ఏనుగులు ప్రత్యక్షం కావడంతో స్థానిక ప్రజానీకం భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్ళ పరిసరాల్లో రెండు మగ ఏనుగులు హాల్‌చల్ చేయడంతో స్థానికులు భయపడి ఇళ్ళ నుండి బయటికి రాలేదు. ఏనుగులు వచ్చిన విషయంను స్థానికులు ఇటు అటవీశాఖ అధికారులు, అటు పోలీసులకు సమాచారం అందజేశారు. వెస్ట్ ఫారెస్ట్ రేంజర్ పట్టాభి, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్యలు సిబ్బందితో ఏనుగులు వచ్చిన ప్రదేశానికి చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. అప్పటికే రెండు ఏనుగులు సంతపేట బుడ్డమాను చెరువులో చేరి జలకాలట ప్రారంభించడంతో అక్కడి నుండి ఏనుగులు ఎండ తగ్గే వరకు ఎక్కడికి వెళ్ళవని నిర్ధారించిన అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఏనుగులకు కాపలా వున్నారు. తమిళనాడు రాష్ట్ర అటవీ ప్రాంతం నుండి తెల్లగుండ్లపల్లి అటవీ ప్రాంతం మీదుగా సంతపేట పరిసరాల్లోకి రెండు ఏనుగులు వచ్చాయని ఫారెస్ట్ వెస్ట్ రేంజన్ పట్టాభి పేర్కొన్నారు. అటవీ ప్రాంత సరిహద్దులో రెండు మగ ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీశాఖకు సమాచారం వుందని ఆ మేరకు అటవీ పరిసర ప్రాంతాల్లో వున్న గ్రామాల ప్రజలకు ఏనుగులు వస్తున్నాయని జాగ్రత్తగా వుండాలని గత రెండు రోజులుగా అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఈ రెండు ఏనుగులు 2019 సంవత్సరంలో చిత్తూరు వచ్చాయని, మళ్ళీ ఇప్పుడు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఏనుగులు వచ్చిన సమాచారం జిల్లా ఫారెస్ట్ అధికారి సుబ్బరాజుకు సమాచారం అందడంతో ఆయన అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చెరువులో ఏనుగులు వున్నంత సమయం వాటిని కవ్వించకుండా వుండాలని, వ్యవసాయ పొలాల వద్దకు రైతులు ఎవ్వరు వెళ్ళవద్దని, అలాగే పశువులను సైతం వ్యవసాయ పొలాల వద్ద కట్టి వేయరాదని ఫారెస్ట్ రేంజర్ పట్టాభి కోరారు. సాయంత్రం వరకు చెరువు వద్ద ఏనుగులకు కాపలా కాసిన ఫారెస్ట్, పోలీసు సిబ్బంది సాయంత్రం 5 గంటల అనంతరం ఏనుగులను బయటికి రప్పించి అటవీ ప్రాంతం వైపుకు తీసుకెళ్ళే ప్రయత్నాలు ప్రారంభించారు. 30 మంది అటవీ సిబ్బంది, 30 మంది ట్రాకర్స్‌తో పాటు పోలీసులు చెరువు నుండి ఏనుగులను బయటికి రప్పించి వాటిని అటవీ మార్గం పట్టించడానికి అటవీశాఖ సిబ్బంది పూనుకున్నారు. ఏనుగులు సంతపేట బుడ్డమాను చెరువు నుండి సాయంత్రం బయటికి వచ్చిన ఏనుగులు మంగసముద్రం వైపుగా సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల వెనుకవైపు వున్న గుట్టల్లోకి తీసుకెళ్ళారు. వెంట అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్స్, పోలీసులు, స్థానికులు వున్నారు. ప్రస్తుతం రెండు ఏనుగులు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల వెనుకవైపు వున్న పెద్ద గుట్ట ప్రాంతం వద్ద వున్నాయి. జిల్లా ఫారెస్ట్ అధికారి సుబ్బరాజు, వెస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పట్టాభి, ఫారెస్ట్‌రేంజర్ థామస్, డిఆర్ఓ కరణ్‌సింగ్‌తో పాటు సిబ్బంది, ట్రాకర్స్ వెంబడిస్తూ వెళ్తున్నారు.

## తాటితోపు వద్ద భారీగా బంగారు చోరీ



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండలం వెంకటపతినగర్ పంచాయతీ పరిధిలోని తాటితోపు సమీపంలోని 2-213లో నివాసం ఉంటున్న హెచ్.సాయిలక్ష్మి (60)ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తిరుపతిరూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిన్నగోవింద్ తెలిపారు. ఈనెల 3వ తేదీన అనారోగ్యంతో ఉన్న బావను చూసేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లిన బాధితులు ఆదివారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగిలి ఉండటాన్ని గమనించినట్లు తెలిపారు. ఇంటి లోపల పరిశీలించగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉండగా అందులో దాచిన సుమారు68 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.30వేలు నగదు మాయ మైనట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతిరూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీరాములు కేసు నమోదు చేసి, ధర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్నామని, దొంగలను త్వరలో పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇండ్లకు తాళం వేసి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విలువైన ఆభరణాలను బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు.

# బర్డ్ ఫ్లూ పంజా

### ఫౌల్ట్రీ రైతులను అప్రమత్తం చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:
జిల్లాలో బర్డ్‌ఫ్లూ(ఏవిఎన్ ఇన్‌ఫ్లూయెంజా) వైరస్ పంజా విసరడానికి సిద్ధంగా వుంది. ఏవిఎన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌పై ఫౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. జిల్లాలోని ఫౌల్ట్రీల్లో ఎక్కడైన ఎక్కువ సంఖ్యలో కోళ్ళు మృతి చెందితే సత్వరం పశుసంవర్ధకశాఖ, కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు సత్వరం సమాచారం అందించాలని కోరారు. ఏవిఎన్ ఇన్ ఫ్లూయెంజా పక్షి నుండి పక్షికి మాత్రమే వ్యాపిస్తుందని, ఇది పక్షుల నుండి మనుషులకు వ్యాప్తి చెందదన్నారు. బర్డ్‌ఫ్లూపై ఫౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా వుండి ఎక్కడైనా ఎక్కువ సంఖ్యలో కోళ్ళు మృతి చెందితే సత్వరం సంబంధిత శాఖలకు సమాచారం అందించి కట్టడికి పక్కాగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బర్డ్‌ఫ్లూకు సంబంధించి ఎదైనా సమాచారం వుంటే పశుసంవర్ధకశాఖ 70131 19447, కలెక్టరేట్ కంట్రోల్ రూం 08572-242730 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

### పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ర్యాపిట్ టీమ్‌లు

పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ర్యాపిడ్ టీమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుండి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ కార్వేటినగరం మండలంలో కోళ్ళ మరణాలు సంభవించిన నేపథ్యంలో పశుసంవర్ధకశాఖను అప్రమత్తం చేశారు. కార్వేటినగరం మండలం ఆర్‌కెవిబి పేట పరిసర ప్రాంతాల్లో పరిసరాలు పరిశుభ్రంగా వుండేలా జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, పశు సంవర్ధకశాఖ జెడిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్వేటినగరం మండలంలో కోళ్ళ మృతిపై సేకరించిన నమూనాలను ఉన్నత స్థాయి పరీక్షల కోసం మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ ఎనిమల్ డిసిజెస్‌కు పంపడం జరిగిందన్నారు. ఈ నివేదిక వచ్చే వరకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అప్రమత్తంగా వుండాలన్నారు.

## వృద్ధురాలి దారుణ హత్య

### చెవులు..గొంతు కోసిన వైనం.. ఓఎన్ కొత్తూరులో ఘటన !!



హత్యకు గురైన చిన్నక్క

గుడుపల్లె, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త
వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లిన ఓ వృద్ధు రాలిని గుర్తు తెలియని దుండగులు హతమార్చిన సంఘటన మండలంలోని ఒఎన్ కొత్తూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామంలో చిన్నక్క (70) నివాసం ఉంటోంది. ఈమె కుమారులు జీవనోపాధి కోసం బెంగళూరులో ఉంటున్నారు. ఆదివారం చిన్నక్క తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా అక్కడ హత్యకు గురై పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు సమాచారం అందించారన్నారు. కాగా చిన్నక్క చెవులు, గొంతు సైతం గుర్తు తెలియని దుండగులు కోసి హతమార్చారన్నారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం



# స్థానిక సంస్థల్లో సత్తా చాటండి

### -జిల్లా అధ్యక్షుడు సామంచి పనితీరుభేష్
### -బిజెపి చీఫ్ మాధవ్, ఎమ్మెల్యే ఆదినారాయణ

తిరుపతి,పిబ్రవరి 8ప్రభాతవార్త:
తిరుపతి జిల్లాలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తాచాటాలని, ఇందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు పార్టీతో సమన్వయంగా పనిచేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాదవ్ సూచించారు. తిరుపతి జిల్లాలో బిజెపిని మరింత బలోపేతం చేసుకునే దిశగా జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. పార్టీలో అందరినీ కలుపుకుని వెళ్ళి నూతన కార్యవర్గం, పార్టీ పదవులు కేటాయింపులో సామంచి ఆలోచనతో ముందుకు వెళుతున్నారన్నారు. పార్టీకోసం పనిచేసే యువతకు ప్రాధాన్యతనిస్తామన్నారు. తిరుపతిజిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన ఆయన బాధ్యతలు చేపట్టి ఏడాదిపాలన పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉదయం తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో "బిజెపి కమలవికాసం "సదస్సు నిర్వహించారు. ప్రత్యేక అతిధులుగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, విశిష్టఅతిధులుగా బిజెపి రాష్ట్రకమిటీ నాయకులు దయాకర్‌రెడ్డి, నాగోతు రమేష్‌నాయుడు, కోలా ఆనంద్, అశోక్‌రాజు, పనతుల సురేశ్, నిషిధరాజు, భానుప్రకాశ్‌రెడ్డి, జల్లిమధుసూదన్, వరప్రసాదరావు,గాలి పుష్పలత,వరప్రసాద్, పొనగంటి భాస్కర్, విశ్వనాథ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు. బిజెపి జెండా స్థానిక ఎన్నికల్లో ఎగురవేయాలని నాయకత్వానికి బలమైన సంకేతం ఇచ్చారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పివిఎన్ మాధవ్ తెలిపారు. కాగా కూటమిలో బిజెపి కలవకుంటే రాష్ట్రంలో టిడిపి, జనసేన లేదని బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమిలో బిజెపినే ప్రధానమని, ఆ తరువాతే టిడిపి, జనసేన పార్టీ వాళ్ళుంటారని ఘాటుగా స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి నాయకులకు అవకాశం ఇవ్వాలని ఆయన సూచించారు.

# కల్తీ నెయ్యి సరఫరాలో దోషులకు శిక్ష తప్పదు

### - ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ



నాయుడుపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త
కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం, కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో గత పాలకుల హయాంలో జరిగిన అపచారం అత్యంత బాధాకరమని, ఇది ప్రతి భక్తుడి గుండె రగిలిపోయేలా చేస్తోందని, కల్తీ నెయ్యి సరఫరా చేసిన దోషులకు శిక్ష తప్పదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం సూళ్లూరుపేటలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సీబీఐ నివేదికల్లో వాస్తవాలు పరిశీలిస్తే, స్వామివారి లడ్డూ తయారీకి వాడింది అసలు పాల నుంచి తీసిన నెయ్యే కాదని స్పష్టమవుతోందన్నారు. దాదాపు 58 లక్షల కిలోల పామ్ ఆయిల్, ఇతర రసాయనాలు కలిపి ఆ ద్రవాన్ని నెయ్యిగా భ్రమించి భక్తుల విశ్వాసాలతో ఆడుకున్నారని తెలిపారు. ఇది కేవలం కల్తీ కాదు,హిందూ ధర్మంపై జరిగిన ఒక పథకం ప్రకారం చేసిన దాడి అన్నారు. యావత్ భారతం గర్వించే అయోధ్య రామమందిర విగ్రహ ప్రతిష్ఠ సమయంలో ఇదే కల్తీ నెయ్యితో చేసిన లక్ష లడ్డూలను పంపడం కన్నా ఘోరం మరొకటి ఉండదన్నారు. ధర్మంపై పగ పట్టిన వారే ఇలాంటి పనులకు ఒడిగడతారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఏడుకొండల వాడికి రెండు కొండలు చాలు అన్న వారసత్వం నుంచి వచ్చిన వారు తిరుమల పవిత్రతను కాపాడతారని అనుకోవడం మన భ్రమ అన్నారు. 2022లోనే కల్తీ జరుగుతోందని రిపోర్టులు వచ్చినా, గత ప్రభుత్వం వాటిని తొక్కిపెట్టి భక్తుల నోట్లో మట్టి కొట్టిందని విమర్శించారు. కిలో నెయ్యి కేవలం 320 రూపాయలకే వస్తుందంటేనే అందులో మోసం ఉందని సామాన్యుడికి కూడా అర్థమవుతుందన్నారు. ఈ అపచారానికి నిరసనగా ఆదివారం సూళ్లూరుపేటలో నిర్వహించిన నిరసన ర్యాలీ అత్యంత విజయవంతమైంది. దేవుడిని నమ్మని వారు,ధర్మం మీద గౌరవం లేని వారు చేసిన ఈ పాపానికి వారు కచ్చితంగా శిక్ష అనుభవిస్తారని తెలిపారు. భగవంతుడి మీద పగ పట్టిన వారు మట్టికొట్టుకుపోక తప్పదన్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరూ ఏడుకొండల వాడికి మోకరిల్లి క్షమాపణ చెప్పే వరకు మా పోరాటం ఆగదన్నారు.

# పరీక్షా కేంద్రాలా... పశువుల పాకలా...!



తిరుపతి విద్య, ఫిబ్రవరి 8 ప్రభాత వార్త
ఎస్వీయూ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు యూజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి.అయితే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనలో వర్సిటీ అధికారులు ఘోరంగా విఫలమయ్యారు.ఉమ్మడి జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలలో కనీసం డిగ్రీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు బెంచ్లు ఏర్పాటు చేయకుండా నేల కింద కూర్చోబెట్టి పరీక్షలు రాయిస్తున్నారు.ఈ విషయంపై పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ వర్సిటీ ఇంచార్జి చిన్న మాట్లాడుతూ విద్యార్థులకు వర్సిటీ అధికారులు పశువుల కన్నా హీనంగా చూస్తున్నారని, పరీక్షా కేంద్రాలలో కనీసం ఫర్నీచర్ ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్వీయూ పరిధిలోని అన్నమయ్య జిల్లా వాయల్పాడులోని డిగ్రీ కళాశాలలో గురువారం,శుక్రవారం జరిగిన పరీక్షల తీరు ఆవేధన కలిగించిందన్నారు. పరీక్షలు రాయడానికి తీసుకువచ్చిన విద్యార్థులు తల్లిదండ్రులు పరిస్థితిని గమనించి తీవ్ర అసహనానికి గురయ్యారని తెలిపారు. ఇలాంటి దారుణ పరిస్థితులను గమనించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలపై ప్రజలలో నమ్మకం సన్నగిల్లి డిగ్రీ కోర్సులలో చేర్పించడం మానివేస్తున్నారని వాపోయారు. విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ఎస్వీయూ ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమయ్యారని తీవ్రంగా విమర్శించారు. వర్సిటీలో జరిగే ప్రకాశం భవనం, సైన్స్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలో కూడా సరైన మౌలిక వసతి సదుపాయాలు కల్పించకపోవడం దారుణం అన్నారు. ఇటీవల మూడో సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన సందర్భంగా పలువురు విద్యార్థులు గాలి, వెలుతురు సరిగా లేని గదులలో పరీక్షలు రాశామని తమ వద్ద వాపోయారని ఆరోపించారు. వర్సిటీ ఉన్నతాధికారులు రూసా నిధుల ఖర్చుపై పూర్తిగా నిమగ్నమై ఉన్నారే తప్ప వర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలల స్థితిగతులపై ఏర్పాటు చేసిన కమిటీల రిపోర్టు సరైనదా కాదా అని ఆలోచించి వివేచినా జ్ఞానం లేకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా పరీక్ష రాసే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి పరీక్ష రాసే విధంగా చూసుకోవాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## స్వామివారి ఆశీస్సులందరిపై ఉండాలి



తిరుమల,పిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందరిపై ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు టిడిపి ఎమ్మెల్యేలు తెలిపారు. ఆదివారంఉదయంవిఐపి బ్రేక్‌లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ వేర్వేరుగా ఆల యంలోనికి చేరుకున్నారు. ఇష్టదై వాన్ని దర్శించు కున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## బిజెపి కండువా వేసుకున్న మునీశ్వర్‌రెడ్డి

తిరుపతి,పిబ్రవరి 8ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా పాకాలమండలం మద్దినాయనిపల్లికి చెందిన వైసిపి నేత ,ప్రింటింగ్ ప్రెస్ మాజీ ఛైర్మన్ ఎన్.మునీశ్వర్‌రెడ్డి ఆదివారం బిజెపి కండువా వేసుకున్నారు .ఆయన తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ నాయకత్వంలో రాష్ట్రఅధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సమక్షంలో మునీశ్వర్‌రెడ్డి తన అనుచరులతో కలసి బిజెపిలో చేరారు. సాదరంగా పార్టీలోకి బిజెపి నేతలు స్వాగతించి పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించాలని సూచించారు. ఆదివారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన బిజెపిలో చేరడంతో పలువురు అభిమానులు అభినందించారు.

## నేడు విజయపురంలో ఎమ్మెల్యే పర్యటన

విజయపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన విజయపురం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంపిణీ చేయనున్న ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ, ఈ సైకిల్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొంటున్నారని మండల టీడీపీ నేతలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టీడీపీ ముఖ్య నాయకులు, సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

## తేజేష్‌ని అభినందించిన మాజీమంత్రి రోజా

పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



జూనియర్ బాల్ బ్యాడ్మింటన్‌లో జాతీయ జట్టుకు ఎంపికైన నగరి పట్టణానికి చెందిన తేజేష్‌ని మాజీ మంత్రి రోజా అభినందించారు. ఆదివారం తన నివాసం వద్ద తేజేష్‌ని రప్పించిన ఆమె నగరి నుంచి జాతీయ జట్టుకు ఎంపిక కావడం నగరికి గర్వకారణమన్నారు. అంతర్జాతీయ క్రీడల్లోను రాణించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా క్రీడాకారుడు తేజేష్ మాట్లాడుతూ ఐదేళ్ళ క్రితం సబ్ జూనియర్ పోటీలకు నగరి నుంచి శ్రీకాకుళంకు వెళ్ళడానికి టీం మొత్తానికి మాజీమంత్రి రోజా అన్ని ఖర్చులు భరించి పంపించారని అదే తొలి సారి నేషనల్ గేమ్స్‌లో విజేతగా నిలవడానికి కారణమైందన్నారు. అప్పటి నుంచి బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వస్తున్నానని, గత నెల 27 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు తమిళనాడు ఈ రోడ్డు ఎక్సెల్ కళాశాలలో 70వ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయని ఈ పోటీల్లో మన రాష్ట్ర జట్టు 3వ స్థానాన్ని కైవసం చేసుకుందని తాను జాతీయ జట్టుకు ఎంపికయ్యానంటూ మాజీమంత్రికి కృతజ్ఞతలు తెలిపాడు. క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు తప్పకుండా ప్రోత్సాహం అందిస్తామని, వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

తిరుపతి,పిబ్రవరి 8ప్రభాతవార్త:



ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను రద్దు చేసినట్లు నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నేడు సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందరూ అధికారులు, మంత్రులతో సమావేశం నిర్వహించ నున్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు పురస్కార వేదిక రద్దు చేసినట్లు తెలిపారు.

## 18వ పుస్తక ప్రదర్శన



తిరుపతి,పిబ్రవరి 8ప్రభాతవార్త: భారతీయ విద్యాభవన్ తిరుపతి కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో 18వ గొప్ప పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్ర మానికి విశిష్ట అతిథిగా తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య హాజరయ్యారు. పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించుకొని జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలని ఆకాంక్షి ంచారు. భారతీయ విద్యాభవన్ లో ఉన్నత విద్యా ప్రమాణాలతో పాటు మానవీయ విలు వలను నేర్పించడం సంతోషకరమని తెలిపారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ ఆచార్య కె.ఎన్. సత్యనారా యణ ,పుస్తక ప్రదర్శన కన్వీనర్ , భారతీయ విద్యా భవన్ గౌరవ సంచాలకుడు , కోశాధికారి డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు , చైర్మన్ విశ్వనాథ రాజు .భారతీయ విద్యా భవన్ నిర్వహించిన వివిధ పోటీలలో( క్విజ్, బృంద చర్చ, ఫ్యాన్సీ డ్రెస్, బృందగానం) గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా బహుమతి ప్రదానం చేయడం జరిగింది

## బ్రహ్మకుమారీస్ రథం బోల్తా.. తప్పిన ప్రమాదం

కుప్ప ం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



అనంతపురం జిల్లా నుంచి వస్తున్న బ్రహ్మకుమారీస్ రథం అదుపు తప్పి స్థానిక సామగుట్టపల్లి క్రాస్ వద్ద బోల్తా పడింది. అయితే ఈ సంఘ టనలో ఎవరూ గాయపడకపోగా ప్రమాదం తప్పింది. మహాశివరాత్రి సందర్భంగా ప్రచారం నిర్వహించేం దుకు ఈ రథం కుప్పం వచి ్చనట్లు సమాచారం.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలకు సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి అందిన సమస్యలను పరిశీలించి వాటిని సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## నేడు పోలీసు స్పందన

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం పాత జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకుని పోలీసు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని ఎస్పీ తెలిపారు.

## బిఆర్‌డి ఆస్పత్రిలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం

కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



స్థానిక బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర ్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరంకు విశేష స్పందన లభించిందని ఆస్పత్రి డైరెక్టర్ డా॥ బిఆర్ సురేష్‌బాబు తెలిపారు. బెంగళూరు నోవా ఫెర్టిలిటీ సెంటర్ డా॥ లావణ్య, బిఆర్‌డి ఆస్పత్రి సీనియర్ గైనకాలజిస్ట్ డా॥ హరిత మండవ అధ్వర్యంలో ఈ శిబిరం జరగ్గా 63మందికి పైగా దంపతులు వచ్చారన్నారు. ఇరవైమందిని ఐవిఎఫ్ చికిత్స కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు తమ ఆస్పత్రిలో నిర్వహించిన సంతాప సాఫల్య శిబిరానికి 800మందికి పైగా వచ్చారని, 500మందికి పైగా జ ంటలు సత్ఫలితాలు సాధించినట్లు తెలిపారు.

## డ్రోన్ నిఘాతో పట్టుబడిన కోడిపందెం రాయుళ్లు

శాంతిపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



మండలంలోని చిన్నకర్లగట్ట – చీమన పల్లి గ్రామాల మధ్య ఉన్న లక్ష్మయ్య చింత చెట్లతోపులో కోళ్ల పం దేలు ఆడుతున్న వారు డ్రోన్ కెమెరా నిఘాతో పోలీసులకు పట్టు బడ్డారు. అందిన సమా చారం మేరకు రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ ఆదేశాలతో తాము లక్ష్మయ్య చింతచెట్ల తోపులో తనిఖీలు చేయగా కుప్పం, కర్ణాటక, తమిళనాడుకు చెందిన 17 మంది పట్టుబడినట్లు రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ తెలిపారు. నిందితులనుంచి రూ44220నగదు, మూడు పందెంకోళ్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు. ప్రజలు జూదం, కోడిపందేలు, పేకాటలకు దూరంగా ఉండాలన్నారు. ఏదేని సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## గంగవరం అర్బన్ సిఐగా రామ్‌భూపాల్

గంగవరం,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :



గంగవరం అర్బన్ సిఐగా రామ్‌భూపాల్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పుంగనూరు రూరల్ సిఐగా పనిచేస్తూ బదిలీపై గంగవరంకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న బొడ్డు ప్రసాద్‌ను గంగాధర్ నెల్లూరుకు బదిలీ చేయడంతో ఆ స్థానంలో రామ్‌భూపాల్‌ను డిఐజి నియమించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తానని, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ ప్రోటోకాల్‌కు భంగం వాటిల్లకుండా, నేరాల నియంత్రణకు, ప్రమాదాల నివా రణపై ప్రత్యేక దృష్టి సారించి, శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు.

## చౌటూరులో మునెమ్మ కర్మక్రియలో మాజీ మంత్రి రోజా

పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

పుత్తూరు మున్సిపాలిటీ 5వ వార్డు చౌటూరులో మాజీ కౌన్సిలర్ శివలింగ అమ్మ మునెమ్మ కర్మక్రియలో మాజీమంత్రి రోజా పాల్గొన్నారు. మునెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులు అరెస్ట్:: సీఐ

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



రైల్వే కోడూరు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో ముదాముగా పనిచేస్తున్న కే.మణయ్య అనే వ్యక్తిని విధులు ముగించుకొని ఇంటికి వెళుతున్న తరుణంలో చిట్వేల్ రోడ్డు బ్రిడ్జి పైన కొంతమంది పాత కక్షలు మనసులో పెట్టుకొని ఇద్దరు వ్యక్తులు అడ్డగించి మారణాయుధాలతోను బండికి అడ్డం పడి కళ్ళల్లో కారం చల్లి దాడి చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బాధితుడు మణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాయపడిన బాధితుని తిరుపతికి తరలించి కేసును రైల్వేకోడూరు సిఐ చంద్రశేఖర్ హుటాహుటిన నిందితుల వివరాలను సేకరించి అనతికాలంలోనే నిందితులపై విచారణ చేపట్టి ఆదివారం రైల్వే కోడూరు మండలంలోని అనంతరాజుపేట తిరుపతికి వెళ్లే రహదారిలో నిందితులు ఇనరాతి శ్రీనివాసులు, మరో నిందితుడు ఇనరాతి కులశేఖర్‌లను తన సిబ్బందితో అరెస్టు చేసి ముద్దాయిలను కోర్ట్ నందు ఆర్డర్ పెట్టినట్టు సీఐ తెలియజేశారు. నేర స్థలంలో ముద్దాయిల యొక్క ఐరన్ పైపు, కత్తి, కారంపొడి తదితర వాటిని స్వాధీనపరుచుకున్నట్టు తెలిపారు. ఈ కేసును అనంతకాలంలోనే చేదించిన కోడూరు సిఐ చంద్రశేఖర్‌ను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

## సినీ ప్రొడ్యూసర్ బండ్ల గణేష్‌కు పాదయాత్రకు....

ఘన స్వాగతం పలికిన ప్రముఖ పారిశ్రామికవేత్త టిడిపి సీనియర్ నాయకులు మాచినేని విశ్వేశ్వర నాయుడు...



*ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త*

సీఎంచంద్రబాబు నాయుడు సీఎం అయితే శ్రీవెం కటేశ్వరస్వామికి తిరుపతి తిరుమలకు పాద యాత్రద్వారాతిరుమలకువెళతానని సినీ ప్రొడ్యూ సర్ బండ్ల గణేష్ శ్రీవారిని ముక్కుకు న్నారని పాదయాత్ర చేయడంతో పుల్లంపేట ఓబులవా రిపల్లి రైల్వే కోడూరు జాతీయ రహ దారిలో టిడిపి నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని టిడిపి నాయకులు ప్రముఖ పారిశ్రామి కవేత్త మాచినేని విశ్వేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి స్వాగతిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు మద్దినేని కిరణ్ కుమార్ నాయుడు, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## తల్లి(శునక) ప్రేమ...!



చౌడేపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

సృష్టిలో వెలకట్టలేనిది ఏదైనా వుందంటే అది తల్లి ప్రేమ ఒక్కటే...తన మరణంలోనూ కన్న పేగును బతికించుకొన్న అమ్మలను చూశాం...అలాంటి అమ్మ ప్రేమను గురించి రాసేందుకు అక్షరాల్లేవు చెప్పేందుకు మాటల్లేవు...కడుపార కన్న శనకంపై స్కూటర్ పోవడంతో రోడ్డున పడి ఏడ్చుకొంటూ వుండగా ఎక్కడి నుంచి వచ్చిందో తల్లి శనకం స్కూటరిస్టును వెంబడించి మరీ తరుముకొంది. అతను స్పీడ్‌గా వుడాయించడంతో బిడ్డ కష్టం చూసి చుట్టూ తిరిగి తీసుకెళ్ళి కాపాడే ప్రయత్నం చేసింది. కొందరు దాన్ని రక్షించేందుకు వచ్చినప్పటికీ వారినెవ్వరినీ దగ్గరికి రానివ్వకుండా పిల్ల శునకాన్ని నోట కరచుకొని వెళ్ళి పోయింది. ఏ జీవిలోనైనా తల్లి ప్రేమ ఇలానే వుంటుందని అందరూ అనుకొన్నారు.

## వాల్టా చట్టం ఉల్టా

సోమల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



ప్రజల కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసిన అవి అమలులోకి వచ్చే సమయా నికి అక్రమార్జన పరులకు చుట్టాలుగా మారుతున్నాయి. చట్టాలు పుస్తకాలికే పరి మితమవుతున్నాయి. ప్రకృతి సమతౌ ల్యాన్ని పరిరక్షి ంచేందుకు ప్రభుత్వం ఎంతో పకడ్బందీగా వాల్టా చట్టం తీసుకు వచ్చింది. దీనివల్ల ఏ ఒక్క పచ్చని చెట్టు కూల్చకుండా పరిరక్షి ంచి పచ్చదనాన్ని పెంపొందించ వచ్చని ప్రభుత్వం ఊహించింది. చట్టానికి పదును బెట్టి అధికారులకు కట్టబెట్టింది. దాన్ని అమలు చేయాల్సిన అధికారులు మాత్రం ప్రలోభాలకు లొంగి యదేచ్ఛగా కలప అక్రమ రవాణా జరుగుతున్న తమకు సంబంధం లేనట్టు మిన్న కుండిపోతున్నారు. దీంతో వందలాది సంవత్సరాల పచ్చని చెట్లు కూలిపోతున్నాయి. పచ్చదనం లేక గ్రామాల స్వరూపాలే మారిపోతున్నాయి. పల్లెల్లో కూడా స్వచ్ఛమైన గాలి కోసం ప్రజలు వెతుక్కోవాల్సి వస్తోంది. లారీల్లో వెళుతున్న కలప గ్రామాలు దాటి మండలాల మీదుగా జిల్లా కేంద్రం దాటుకుని పక్క రాష్ట్రాలకు తరులుతున్న పట్టించుకుని నాథుడు కరువయ్యారు. ఇకనైనా అధికార గణం స్పందించి అక్రమ రవాణాలు అడ్డుకోకపోతే భావితరాలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంది

## శ్రీ నృసింహుని సేవలో మధు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

మండలంలోని వనమలదిన్నెలో శ్రీ లక్ష్మీ ృనరసింహస్వామి ఆలయ ప్రారం భోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. పరమ పూజ్య శ్రీమద్ విద్యా ప్రసన్న తీర్థ స్వామీజీ ఈ కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఆయనతోపాటు నియోజకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకులు వై మధుసూదన్ నాయుడు పూజలలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మధుసూదన్ నాయుడుకు తీర్థ,ప్రసాదాలు అందజేశారు. భక్తులు,వనమలదిన్నె గ్రామ పెద్దలు,ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

## ఉద్యోగుల ఆర్థిక సమస్యలపై ఎమ్మెల్యేలకు వినతిపత్రం



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఆదివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి కార్యదర్శి హనుమంత్‌ను కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక సమ స్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీజిఈఏ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు వి. శివయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన ఆర్థిక బకాయిలు సుమారు రూ.35 వేల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్లో వేతన సవరణ, నాలుగు విడతల డీఏ, సరెండర్ లీవులు, పెండింగ్ బకాయిలకు స్పష్టమైన కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బకాయిల పరిష్కారం, విశ్రాంత న్యాయమూర్తితో పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి, డీఏ అంశాలను బడ్జెట్లో పొందుపరచాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయంగా బాకీకి భూమి అనే ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీజిఈఏ జిల్లా, తాలూకా నాయకులు పాల్గొన్నారు.

## బైరెడ్డిపల్లిలో ఘనంగా మైలేరు పండుగ



బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండలంలో ఫిబ్రవరి ఏడవ తారీఖున గంగమ్మ జాతరను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ పండుగకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ముక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి వాలీబాల్ పోటీలలో బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అదేవిధంగా ఆదివారం తమిళనాడు కర్ణాటక రాష్ట్రంలో నుండి భారీ ఎత్తున పోటీలలో పాల్గొన్నాయి. మొదటి బహుమతి లక్ష రూపాయలు కావడం చేత దేశీయ ఎద్దులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రైజ్ నన్ను గెలుచుకోవడం జరిగినది. జిల్లాలోనే పేరు అందిన బైరెడ్డిపల్లి మైలేరు పండుగకు ప్రజలు తండోప తండాలుగా వస్తారు యువకుల నుండి 80 సంవత్సరాల వృద్ధులు కూడా ఈ పండుగను చూడడం అదృష్టమని భావిస్తారు. ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దులకు ఎంతో గౌరవం దక్కుతుంది. ఈ ఎద్దులను చిన్నప్పటినుండే తర్ఫీదు ఇవ్వడం జరుగుతుంది. ప్రతి ఏటా ఈ పండుగను

# రైల్వే కోడూరు డివిజన్

## సినీ నిర్మాత బండ్ల గణేష్‌కు సుదర్శన్ శర్మ ఘనసన్మానం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



తెలంగాణలోని షాద్నగర్‌కు చెందిన ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్ శ్రీవారి పాదయాత్ర చేపట్టిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో బండ్ల గణేష్ రైల్వే కోడూరు నుండి సెట్టిగుంట లక్ష్మీగారిపల్లి వద్దకు చేరుకోగా ప్రముఖ ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కమిటీ సలహాదారులు డాక్టర్. బండ ఆత్మకూరు సుదర్శన్ శర్మ బండ్ల గణేష్‌ను సత్కరించి శ్రీవారి లడ్డును ప్రసాదాన్ని శ్రీవారి వస్త్రాలను బహుకరించారు. శెట్టి గుంట లక్ష్మీ గారి పల్లె వాసులు భారీగా పాల్గొన్నారు.

## లలితమ్మ మృతి బాధాకరం...

టిడిపి యువ నాయకులు సాయి వికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



తల పక్షి లలితమ్మ ఆకస్మిక మృతి ఎంతో బాధాకరమని రైల్వే కోడూరు నియోజకవర్గం టిడిపి యువ నాయకులు ముఖ్య సాయి వికాస్ రెడ్డి అన్నారు. ఆదివారం రైల్వే కోడూరు నియోజ కవర్గంలోని సెట్టిగుంట గ్రామానికి చెందిన గోపాలకృష్ణ భార్య లలితమ్మ మృతి బాధాకరమని అన్నారు. అనంతరం మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలుచోట్ల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటాం అధైర్య పడవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# తిరుమల లడ్డుపై విష ప్రచారం : నేదురుమల్లి



వెంకటగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: లడ్డు ప్రసాదంలో వాడే నెయ్యిలో జంతు కొవ్వు లేదని సిబిఐ, సిట్ నిగ్గు తేల్చినా సీఎం బాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు ఇంకా భక్తుల విశ్వాసంతో రాజకీయం చేయడం తగదు అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎన్ జే ఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. బాధ్యతాయుతమైన సీఎం పదవిలో ఉన్న చంద్రబాబు తిరుమల లడ్డు ప్రసాదం పై నిరాధారమైన ఆరోపణలు చేసి అబాసు పాలయ్యారు అని చెప్పారు. లడ్డు ప్రసాదంలో పంది కొవ్వు కలిసిందని ఆరోపించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుమల మెట్లు కడిగి నాటకాన్ని రక్తి కట్టించారని తెలిపారు. సుప్రీం కోర్టు నేతృత్వంలోని సిట్, సిబిఐలు అందించిన నివేదికలో జంతువుల కొవ్వు లేదని నిరూపితం అవ్వగా మింగుడు పడని చంద్రబాబు ఏకసభ్య కమిషన్ అంటూ కొత్త రాగం తీస్తున్నారని తెలిపారు. అక్రమ కేసులు పెట్టే పోలీసులతో పాటు, వెంకటగిరిలో భూకబ్జాకు సహకరించే రెవెన్యూ మున్సిపల్ అధికారులపై భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని నేదురుమల్లి తెలిపారు. భూకబ్జాలకు సహకరించడం, ఉచితంగా అందించాల్సిన ఇసుకను సొమ్ము చేసుకుంటుంది. ఎవరో వెంకటగిరి ప్రజలందరికీ తెలుసు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పదవికి ఆయా స్థాయిల్లో గౌరవం ఉంటుందని, ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మున్సిపల్ కౌన్సిలర్లను అవమానించడం, ఆపై వారి గురించి మున్సిపల్ చైర్మన్ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించి అవహేళన చేయడం అధికార దుర్వినియోగంతో ప్రోటోకాల్ ఉల్లంఘించడమేనని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఇచ్చిన హామీలైన ఆల్తూర్ పాడు రిజర్వాయర్ పనుల ప్రారంభం ఏమైందని ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, పార్టీ అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జిల్లా టెలికం సలహాలు హరికృష్ణ, కౌన్సిలర్లు శంకరయ్య, ధనియాలరాధా, పూజారిలక్ష్మి, శ్రీనివాసులు లు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుడుకు ఘన నివాళి



పెళ్లకూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మండలంలోని ముమ్మారెడ్డి గుంట పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు మట్టిపాటి చెంగయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం నాడు తుది శ్వాస విడిచారు. ఆదివారం నాడు ముమ్మారెడ్డి గుంటలో జరిగిన అంతక్రియలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం అంటూ ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రఘు నాయుడు, ఒబ్బు వెంకటరత్నం, జడ్పిటిసి నన్నుం ప్రిస్కిల్లా, ఎల్లు మోహన్, సాగి జితేంద్ర, గురవయ్య పాల్గొన్నారు.

## నేడే ఎంపిటీసీ, సర్పంచ్‌లు టిడిపిలో చేరిక

వాకాడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మండలంలోని సోమవారం షాదీ మంజిల్‌లో దుగ్గరాజుపట్నం ఎంపిటీసీ సన్నారెడ్డి శైలజరెడ్డి, గ్రామ సర్పంచ్ వైలంగారి శ్రావణిలు గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా పసుపు జండా కప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ సీనియర్ నాయకుడు సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి ఆదివారం స్థానిక విలేకరులకు ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ మేరకు దుగ్గరాజ పట్నం వైకాపా ఎంపిటీసీ సన్నారెడ్డి శైలజారెడ్డి భర్త వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి చంద్రభూషణ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వైలం శ్రావణి భర్త వైకాపా సీనియర్ నాయకుడు మహేంద్ర వీరితో పాటు తీర ప్రాంత గ్రామాల పంచాయతీ నాయకులు, వందలాది మంది కార్యకర్తలు, ప్రజలు తదితరులు పసుపు జెండా కప్పుకుంటున్నారు. టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

## స్పెషల్ డ్రైవ్ సర్వేను పరిశీలించిన అధికారులు



వాకాడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మండలంలోని జరుగుతున్న స్పెషల్ డ్రైవ్ యుఎఫ్ఎస్ సర్వే కార్యక్రమంను ఆదివారం ఎంపీడీవో సాయి ప్రసాద్ తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌లు పరిశీలించారు. ఎంపీడీఓ సాయి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుఎఫ్ఎస్ సర్వేను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో స్వర్ణ గ్రామ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఆయా పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లతో కలిసి యుఎఫ్ఎస్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. నిర్ణయించిన గడువులోపు యుఎఫ్ఎస్ సర్వేను పూర్తిచేయాలని తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలలో జరుగుతున్న యుఎఫ్ఎస్ సర్వేను ఎప్పటికప్పుడు ఎంపీడీవో సాయి ప్రసాద్, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌లు సంబంధించిన స్పెషల్ అధికారుల ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్నారు.

## పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు : తహసిల్దార్

వాకాడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి సచివాలయంలో రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర వివిధ ప్రభుత్వశాఖల కార్యదర్శులతో నిర్వహించ సమీక్షకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరు కావాల్సి ఉన్నందున సోమవారం జరగవలసిన పీజీఆర్ఎస్ కార్యక్రమమును ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రద్దు చేయడం జరిగిందని మండల తహసిల్దార్ తెలిపారు.

## నూతన సీసీ రోడ్డు శుభారంభం

నాయుడుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజకవర్గం శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ అభివృద్ధిలో భాగంగా చిలమత్తూరు గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులకు శుభారంభం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని పెద్దలు గ్రామ వాసులు హాజరైనారు. అలాగే ఈ అభివృద్ధి కార్యక్రమానికి మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సహాయ సహకారాలు అందించి చిలమత్తూరు గ్రామానికి అండగా నిలిచారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కలగనున్నాయని, గ్రామ అభివృద్ధికి ఇది మరో మైలురాయిగా నిలవనుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి గ్రామ ప్రజలు, ఆ గ్రామ పెద్దలు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రముఖ న్యాయవాది పసలకు సన్మానం

నాయుడుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: జోషుల వారి కండ్రిగ ఆయకట్టు ప్రెసిడెంట్, ఓజిలి మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నలజాం రాజశేఖర్ ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ నాయకులు పసల చెంగయ్య జన్మదిన సందర్భంగా ఆదివారం వారి స్వగృహంలో శాలువా పూల మాలలతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ వార్డ్ నెంబర్ మొండెం బాబు తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీలక్ష్మీ నారాయణ కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణం లోని రావిచెట్టుకు వేపచెట్టుకు కల్యాణం చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు దివి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహించిన ఈ కల్యాణం ప్రపంచ శాంతితో పాటు అందరూ సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో ప్రతి సంవత్సరం మాఘమాసంలో నిర్వహిస్తామని తెలిపారు. దేవస్థానం ఛైర్మన్ వాకిచర్ల రమేష్, అయితా శ్రీధర్ పాల్గొనగా, మహోత్సవానికి మస్తాన్‌నాయుడు, మాధవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## జగన్మోహన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై ఆయన వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం లడ్డూపై నాణ్యత విషయంలో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా స్థానిక పాండురంగ దేవస్థానం నుంచి బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ప్రదర్శన నిర్వహించారు. పాలు లేకుండానే నెయ్యి తయారు చేసి హిందూ భక్తుల విశ్వాసాలతో గత ప్రభుత్వ పెద్దలు ఆటలాడుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. లడ్డూ తయారీకి అసలు నెయ్యి వాడలేదని, కేవలం పామాయిల్, ఇతర రసాయనాలు కలిపి కల్తీ నెయ్యితోనే ఈ ప్రక్రియ చేపట్టారని ఆమె చెప్పారు. ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పాకం వెంకటసుబ్బయ్య, కొండలరావు, ఆలీభాయ్, బొమ్మన్ శ్రీధర్, బండారు ఆంజనేయులు, కొక్కు శంకరయ్య, కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ నెయ్యి పాపాత్ములను శిక్షించు స్వామి : ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: కల్తీ నెయ్యికి పాల్పడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు త్వరగా శిక్ష పడేలా చూడాలని శ్రీవెంకటేశ్వర స్వామిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు. కొవ్వుతో చేసిన రసాయనాలతో నెయ్యి చేసి సిట్ పేరిట క్లీన్ చిట్ అని అబద్ధాలు ప్రచారం చేస్తున్న కరుణాకర్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. శ్రీవారి అన్నప్రసాదాలకు వాడే నెయ్యిని కల్తీ చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులకు శిక్ష త్వరగా పడాలని కోరుతూ ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జనసేన పార్టీ హరే రామ హరే కృష్ణ ఆలయం నుంచి గరుడ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలిని ఉద్దేశించి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ కల్తీ నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఎన్ డిడిబి నిర్ధారించిందన్నారు. ఇంత స్పష్టంగా కల్తీ నెయ్యి లో జంతువుల కొవ్వు కలిసినట్లు నిర్ధారణ అయినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎదురుదాడి చేయడం వారి అవివేకమని ఆయన విమర్శించారు. ఒకపక్క వైవీ సుబ్బారెడ్డి నెయ్యిలో కల్తీ జరిగిందని చెబితే లడ్డూ ప్రసాదాలను కల్తీ చేసిన మనకు భగవంతుడు ఎటువంటి శిక్ష వేశాడో అని మాజీ మంత్రులు రోజా, జోగి రమేష్‌లు మాట్లాడుకోవడం భగవంతుడే వారి చేత నిజం చెప్పించారన్నారు. కరుణాకర్ రెడ్డి వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని లేకుంటే వేంకటేశ్వర స్వామి పెద్ద శిక్ష వేయడం ఖాయమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షులు రాజా రెడ్డి, క్రికెట్ విజయ్, సుధాకర్, సాని శ్రీనివాస్ రాయల్, కార్పొరేటర్లు ఎస్ కే బాబు, పొన్నాల చంద్ర, ఆదం సుధాకర్ రెడ్డి, వరికుంట్ల నారాయణ , సునీల్ చక్రవర్తి, ఆముదాల వెంకటేష్, దూది శివ, కేఆర్ శంకర్, జానపద కళాకారుల అధ్యక్షులు యాదగిరి, సుభాషిణి, శిరీష, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, ఆళ్వార్ మురళి, బుజ్జిబాబు, సుధాకర్ , మణి, జానకి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండపై పెరిగిన భక్తుల రద్దీ



బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కొండ భక్తజన సంద్రమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. విఐపిల తాకిడి అధికం కావడంతో సామాన్య భక్తులు ఇబ్బందులు పడ్డారు. కొండ దినాన్ని పురస్కరించుకొని అర్చక, వేదపండితులు అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ నిర్వహించారు. ఇఒ, ఉపకమీషనర్ భక్తులకు మౌళిక వసతులు కల్పించారు. అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకుల సేవలో నిమగ్నమయ్యారు.

## వెంకటరెడ్డి మృతికి పలువురు సంతాపం



భాకరాపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రముఖ పారిశ్రామిక వేత్త, మాజీ జడ్పీ చైర్మన్ సిద్దరామిరెడ్డి తమ్ముడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బెంగళూరులోని ఒక హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. అయన మృతదేహాన్ని ఆదివారం వారి స్వస్థలం చిన్నగొట్టిగల్లు మండలం వలసారెడ్డిగారి పల్లెకు తీసుకొచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిషోర్ కుమార్‌రెడ్డి, పులివర్తి నాని, చెవిరెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి, ఎంపీపీ యుగంధర్ రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్ని పార్టీల నాయకులు ఆయనకు నివాళి అర్పించారు.

ఫోటో :వెంకటరెడ్డికి నివాళి అర్పిస్తున్న మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి

## టీటీడీ విజిలెన్స్, భక్తుడి మధ్య వాగ్వాదం



తిరుచానూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: తిరుచానూరులో వెలసిన శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. కానీ వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో టీటీడీ అధికారులు విఫలమయ్యారనే మాట వినిపిస్తోంది. భక్తులకు తగు సూచిక బోర్డులు లేక వాహన పార్కింగ్, ఆలయంలోకి వెళ్లే మార్గము తెలియక భక్తులు ఇబ్బంది ఎదుర్కుంటున్నారు. నిత్యం వేలాది సంఖ్యలో వచ్చే భక్తులకు కేవలం ఒకే ఒక్క సెల్‌ఫోన్ జమచేయు కౌంటర్ ఉండడం మరియు క్యూలైన్‌లోకి వెళ్లే సమయంలో స్కానింగ్ లేకపోవడంతో ఆదివారం భక్తులకు విజిలెన్సు సిబ్బందికి పెద్ద వాగ్వాదం జరిగింది. టీటీడీ భక్తులకు సరిపోయే విధంగా సెల్ ఫోన్ మరియు లగేజ్ జమ చేయు కౌంటర్లను పెంచి తగు సూచిక బోర్డులు పెట్టాలని భక్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా భక్తులకు మరియు విజిలెన్సు సిబ్బందికి జరిగిన వాగ్వాదాన్ని సిసి టీవీలో గమనించిన ఆలయ విజిలెన్సు అధికారులు భక్తుడికి అమ్మవారి దర్శనాన్ని కల్పించి, దురుసుగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారు.

## రంకెలేసిన పశువులు, దుమ్మురేగిన వీధులు



పాకాల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మండలం ఇరంగారి పల్లిలో పశువుల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పశువుల పండగను తిలకించేందుకు చుటు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. పశువుల పండగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దులను లొంగదీసేందుకు ప్రజలు ఉత్సాహంగా ప్రయత్నించారు. కొమ్ములకు పలకలతో పశువులు పరుగుతీయగా ఆ పలకలను చేజిక్కించుకునేందుకు యువత పోటీపడింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లావాసి మృతి



రేణిగుంట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై రేణిగుంట మండలం గుత్తి వారి పల్లె గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లా కె.విపల్లి మండలం గర్నిమిట్ట పంచాయతీ కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్.రామకృష్ణ మృతి చెందాడు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు ఆర్.రామకృష్ణ శనివారం రాత్రి శ్రీకాళహస్తి ఐఎస్ఎస్ఈఆర్ కాలేజీ నందు సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహించి ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళుతుండగా రేణిగుంట మండలం గుత్తివారిపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అతని తల గుర్తుపట్టడానికి వీలు లేకుండా మెదడు బయటకు వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ జి టి 1. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సెక్యూరిటీ గార్డ్.

## కాలువల్లో నిండిన సిల్టు తీస్తున్న మునిసిపాలిటి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: పురపాలక సంఘ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు తగిన సదుపాయాల్లేక పోయినా శానిటరీ ఇన్స్పెక్టర్, సూపర్ వైజర్లు కార్మికులను పరుగులు తీయిస్తున్నారు. కమిషనర్ భవాని ప్రసాద్ ప్రతి రోజూ చలిలో కూడా వేకువ జామున పర్యవేక్షణకు వస్తున్నారు. దాంతో ప్రధాన వీధ్లు పారిశుద్ధ్యం సజావుగా సాగుతుంది. నాలుగుమాడావీధులు కమర్షియల్ ప్రాంతాలు ఇళ్ళతో పాటు లాడ్జిలు, హోటళ్ళు ఉన్నాయి. అయితే ఇక్కడ పురాతన కాలం నాటి మురుగునీటి కాలువలున్నాయి. హోటళ్ళ వ్యర్థాలతో కాలువలు నిండిపోతున్నాయి. ఈ సమస్యను గుర్తించిన కమిషనర్ భవాని ప్రసాద్ కాలువల్లో నిండిన సిల్టును తొలగించారు. ఈ నేపధ్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్ మోతీలాల్, సూపర్‌వైజర్ శ్రీకాంత్‌లు నాలుగుమాడావీధుల్లోని కాలువల్లో పేరుకుపోయిన సిల్టును తమ కార్మికుల ద్వారా తొలిగించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## పథకం ప్రకారమే కల్తీ నెయ్యి కుట్ర



పెళ్లకూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: పథకం ప్రకారమే తిరుమలలోని కల్తీ నెయ్యి వ్యవహారంలో కుట్ర జరిగిందని ఏమాత్రం ఉత్పత్తి సామర్థం లేని వైష్ణవి డైరీ లాంటి కంపెనీలకు లైసెన్సులు కట్టబెట్టి నకిలీ లారీ రసీదులు ఫేక్ ట్రాన్స్ పోర్ట్ రికార్డులు సృష్టించి అడుగడుగునా మోసం జరిగిందని సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ మరియు నాయుడుపేట ఏఎంసి డైరెక్టర్ ఉయ్యాల ప్రవీణ్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో, మండలంలోని పునబాక గ్రామంలో ఉన్న వైష్ణవి డైరీ వద్ద నుంచి నిరసనను తెలియజేస్తూ పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గత ప్రభుత్వం కల్తీ నెయ్యి వ్యవహారంలో చేసిన కుట్రలపై విరుచుకుపడ్డారు. కల్తీ నెయ్యి వాడారని సాక్షాత్తు సిట్ నివేదికలు చెబుతున్నప్పటికీ వైసీపీ నాయకులు అసలు లడ్డులో కల్తీయే జరగలేదంటూ అసత్య ప్రచారాలు చేస్తూ ఇంకా ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు అట్ల కృష్ణారావు, జనసేన మండల అధ్యక్షులు విజయ్ మల్లాం, ఏఎంసి డైరెక్టర్లు గిండీ సతీష్, కామిరెడ్డి కేశవల రెడ్డి, ఓజిలి మండలం అధ్యక్షులు గోపి, పెళ్లకూరు మండలం జనసేన ఉపాధ్యక్షులు కుంపటి శ్రీను, అరిగళ్ళ శివ, తాళ్ల రెడ్డి శ్రీనివాస్, సుమతి రావు, ప్రభువు ఉపేంద్ర, రోహిణి, సల్మా, హేమలత పాల్గొన్నారు.

## లడ్డూ పవిత్రతపై దుష్ప్రచారాలు మానండి :ఎంపిపి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: కూటమి నాయకులు తిరుమల శ్రీవారి లడ్డూ నాణ్యతపై ఒక పథకం ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారి, ఇది సమంజసం కాదని ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లడ్డూ నాణ్యతపై సిబిఐ నివేదికలో కల్తీ లేదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, కేవలం అభూత కల్పనలతో మాజీముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా పథకం ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమిలోని నేతలు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు జెట్టి వేణు యాదవ్, బి.కృపాకర్‌రెడ్డి, స్వామిరెడ్డి, అయితా శ్రీధర్, అలవల సురేష్, ఆబాక రమేష్‌రెడ్డి, చిలకా యుగంధర్, తుపాకుల ప్రసాద్, మీజూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పది కేసులు నమోదు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి జాతీయ రహదారితో పాటు పట్టణంలోనూ బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు, లారీడ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి పదిమందిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు సంతాపం



పెళ్లకూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మండలంలోని స్థానికంగా ఉన్న పెళ్లకూరు మిట్ట దళిత కాలనీలో దళిత బహుజన నాయకుడు గంధం తిరుపాలు ఆదివారం నాడు ఆకస్మికంగా మృతి చెందగా మండలంలోని ముమ్మారెడ్డి గుంట గ్రామంలో వైసీపీ నాయకుడు మట్టిపాటి చెంగయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. మండల తేదేపా అధ్యక్షులు సంచి కృష్ణయ్య ఆదివారం నాడు ఇద్దరు మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్యతో పాటు కోట రమేష్ యాదవ్, మేక పిల్ల రవి, మెరుం చంద్ర, రాపూరు పరశురాం పాల్గొన్నారు.

## జగన్ మోహన్‌రెడ్డిని కలసిన కిలివేటి



నాయుడుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం చెన్నైలోని లీలప్యాలెస్ హోటల్‌లో జరిగిన వైయస్ సునీల్‌రెడ్డి కుమారుడు సాహిల్ వివాహ వేడుకల్లో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## విజయవంతంగా తెప్పోత్సవాలు నిర్వహిద్దాం

**- పనులను పరిశీలించిన అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**



తిరుమల, ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలక్షేత్ర పవిత్రతను మరింతగా ఇనుమడింపజేసేలా... ఆధ్యాత్మిక ఉట్టిపడేలా తెప్పలను సిద్దంచేసి విజయ వంతంగా నిర్వహిద్దామని టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులకు సూచించారు. ఈనెల 26నుండి జరిగే సాలకట్ల తెప్పోత్సవాలకు సిద్దమవుతున్న తెప్పను ఆదివారం ఉదయం అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం పరిశీలించారు. తెప్పను పటిష్టంగా ఏర్పాటుచేయాలని, ఇందుకు ఇంజనీరింగ్ అధికారులు భక్తితో పనిచేయాలన్నారు.

## వేడుకగా త్రైమాసిక మెట్లోత్సవం



త్రైమాసిక మెట్లోత్సవం ఆదివారం తిరుమల ఆస్థాన మండపంలో మొదలైంది. ప్రతి ఏడాది ఈ మెట్లోత్సవం నిర్వహించి భజనకళాకారులతో శ్రీవారిని ప్రార్ధించడం ప్రత్యేకత. ప్రభాతవార్త-తిరుమల

## మార్కెట్ యార్డ్‌లో రైతు బజారు ఏర్పాటు చేస్తా

**-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : త్వరలోనే స్థానిక మార్కెట్ యార్డ్‌లో రైతు బజారు ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. రైతు బజారు వల్ల ఒక పక్క రైతులు తమ పంట దిగుబడులను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయించుకోవచ్చని, ఇటు ప్రజలకు అందుబాటులో వుండే ధరలకు నాణ్యమైన కూరగాయలు లభ్యమవుతాయని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో రూ. 1.50 కోట్లతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత నాయకుడు గాలి ముద్దుకృష్ణమనాయుడు ఎమ్మెల్సీగా వున్న సమయంలో మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఆ షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన కుమారుడిగా తాను ప్రారంభించడం ఎంతో ఆనందంగా వుందన్నారు. అనంతరం ఎస్‌బిఆర్ పురం సర్పంచ్ ఆర్.మణిరాజుకు చెందిన ఎం.ఆర్.ఫ్రూట్స్ చిన్న తరహా పరిశ్రమను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, కార్యదర్శి తులసి తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భువనమ్మచే ఆర్గానిక్ స్టోర్ ప్రారంభం



వి.కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి వి.కోటలో పర్యటించారు. కుప్పం ఆర్గానిక్ స్టోర్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ చౌదరి, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## శిధిలావస్థలో గ్రంథాలయ భవనాలు

తొట్టంబేడు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలంలో గ్రంథాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకొని ఉన్నాయి. గ్రంథాలయాల భవనాలు పెచ్చులూడుతున్నాయి. పుస్తకాల సేకరణ పాతబడిపోయింది. సిబ్బంది కొరత, నిధుల కొరత, డిజిటల్ వనరుల కొరత వంటి సమస్యలు గ్రంథాలయాలను పీడిస్తున్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలో స్థానిక పిఆర్ గెస్ట్‌హౌస్ వద్ద గ్రేడ్ వన్ గ్రంథాలయం ఉంది. అదే విధంగా తొట్టంబేడు మండలంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద గ్రేడ్ త్రీ, పెద్ద కన్నలి వద్ద మరొకటుంది. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న గ్రంథాలయం పెచ్చులూడి శిథిలావస్థకి చేరుకొని ఉంది. కొత్త చైర్మన్ దీనిపై దృష్టి సారిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.